క్లుప్తంగా

ఆనందమయ జీవితాన్ని ప్రసాదించాలి: కలెక్టర్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): శోభకృత్ నామ సంవత్సరం జిల్లా ప్రజలకు పాడి పంటలు, సుఖ సంతోషాలతో ఆనందమయ జీవితాన్ని ప్రసాదించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఉగాది శుభాకాంక్షలను తెలిపారు. 'ఉగ' అంటే నక్షత్ర గమనం అని, ''ఆది' అంటే ఆరంభమని ఇదే 'ఉగాది'కి అర్థమని కలెక్టర్ పేర్కొన్నారు. షడ్రుచులతో తయారు చేసే ఉగాది పచ్చడి స్వీకరించే అదృష్టం భారతీయులకే సొంతమన్నారు. ఉగాది పచ్చడి శరీరాన్ని వజ్ర సమానం చేస్తుందని వైద్య శాస్త్రం చెబుతోందని తెలిపారు. తొలి పండగ ఉగాది ప్రజలకు కొత్త శోభను అందించాలని కలెక్టర్ కోరుకున్నారు.

ఉచిత వైద్యపరీక్షలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ లోటస్ ల్యాండ్ మార్క్‌లోని చేయూత మానసిక వికలాంగుల శిక్షణ సంస్థ కార్యాలయంలో మంగళవారం వరల్డ్ సిండ్రోమ్ డే సందర్భంగా ప్రత్యేక చిన్నారులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ పిల్లల వైద్యులు డాక్టర్ బీ మురళీకృష్ణ ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించారు. ప్రత్యేక అవసరాలుగల చిన్నారులకు థైరాయిడ్ తదితర రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా చేయూత మానసిక వికలాంగుల శిక్షణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ టీ కృష్ణకుమారి డౌన్ సిండ్రోమ్ గురించి వివరించారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లిదండ్రులు అడిగిన పలు సందేహాలకు నివృత్తి చేశారు.

సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని లయన్స్‌క్లబ్ సభ్యులు న్యాయవాది అంజూరు శేషుబాబు సూచించారు. స్థానిక మాచవరం వాణీ స్కూల్లో మంగళవారం ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. స్కూలు ప్రిన్సిపాల్ ఏ ఝాన్సీలక్ష్మి పాల్గొన్నారు.

నేడు పన్నులు చెల్లించవచ్చు

పటమట(విజయవాడతూర్పు): ఉగాది సందర్భంగా బుధవారం సెలవు ఉన్నప్పటికీ విజయవాడ నగరపాలక సంస్థ మూడు సర్కిళ్ల పరిధిలోని ఆయా క్యాష్ కౌంటర్లల్లో వీఎంసీకి చెల్లించాల్సిన ఆస్తి పన్ను బకాయిలు కట్టించుకుంటామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

ఉచిత దంత వైద్య పరీక్షలు



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఎన్నీఆర్ డెంటల్ కాలేజ్, రాబిన్ హుడ్ ఆర్మీ సంయుక్త ఆధ్వర్యంలో వాంబేకాలనీలోని అమ్మ ప్రేమ ఆదరణ సేవా సంస్థలోని వృద్ధులకు మంగళవారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. డెంటల్ డాక్టర్లు వెంకటేశ్వరరావు, సీమా రెడ్డి, అనురాధ, రూపాణి, అమ్మప్రేమ ఆదరణ సేవా సంస్థ చైర్‌పర్సన్ కొవ్వాడ అన్నపూర్ణ, ట్రెజరర్ పి.నాగరాధిక పాల్గొన్నారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

పాయకాపురం(విజయవాడరూరల్): ఏప్రిల్ రెండు నుంచి ఎనిమిదో తేదీ వరకు దక్షిణ కొరియాలో జరిగే జాతీయ సాఫ్ట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలకు పాయకాపురానికి చెందిన టిక్క్యం సాయి అన్విత ఎంపికై ంది. ఆసియా కప్ మహిళా విభాగానికి భారత దేశం నుంచి 16 మంది క్రీడాకారులు సాఫ్ట్‌బాల్ చాంపియన్ షిప్‌కు ఎంపిక కాగా, ఆంధ్రప్రదేశ్ నుంచి సాయి అన్విత ఎంపిక కావడం విశేషం.

నూకాలమ్మ జాతర ప్రారంభం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నూకాలమ్మ అమ్మవారి జాతర మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. చిట్టినగర్ సొరంగం రోడ్డులోని నూకాలమ్మ ఆలయంలో మంగళవారం నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు జాతర నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలలో భాగంగా అమ్మవారికి అభిషేకాలు, విశేష అలంకరణ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వాహకులచే కలశస్థాపన చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు నగరంలోని పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువులో రాణింపు



ఎంకేబేగ్ మున్సిపల్ స్కూల్లో విద్యార్థులకు రాగిజావ అందజేస్తున్న ఉపాధ్యాయులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): విద్యార్థులు శారీరక, మానసికంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువులో రాణిస్తారని స్థానిక 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణిమూర్తి అన్నారు. సత్యనారాయణపురంలోని ఏకేటీపీఎం స్కూల్లో జగనన్న గోరు ముద్ద పథకం ద్వారా విద్యార్థులకు మంగళవారం రాగి జావ పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సింగ్‌నగర్‌లో..

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్, న్యూఆర్ఆర్‌పేట, వాంబేకాలనీ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం రాగిజావ పంపిణీ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేశారు.

పాయకాపురంలో..

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురంలోని పలు స్కూల్స్‌లో మంగళవారం విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేశారు. 64వ డివిజన్ బీవీసుబ్బారెడ్డి నగరపాలక సంస్థ హైస్కూల్లో కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మ విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. నాయకులు యర్రగొర్ల శ్రీరాములు, నారాయణ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. 63వ డివిజన్ రాజీవ్‌నగర్లోని నగరపాలక సంస్థ హైస్కూల్, ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థులకు కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మ రాగిజావ పంపిణీ చేశారు. నాయకులు మోదుగుల గణేష్, పసుపులేటి యేసు, సీహెచ్ రవి పాల్గొన్నారు. 62వ డివిజన్లో పుచ్చలపల్లి సుందరయ్య నగరపాలక సంస్థ హైస్కూల్, ఎలిమెంటరీ స్కూల్స్‌లో విద్యార్థులకు కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మీ రాగిజావ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు అలంపూరు విజయ్, వీరబాబు, బొరా బుజ్జి, రామిరెడ్డి, హైమావతి, పాల్గొన్నారు. 61వ డివిజన్ అయితా రాములు ఎలిమెంటరీ స్కూల్లో కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. నాయకులు నాలం బాబు, వి.రాజా, పాల్గొన్నారు.



ఏకేటీపీఎం స్కూల్లో విద్యార్థులకు రాగి జావ అందజేస్తున్న కార్పొరేటర్



కండ్రిక స్కూల్లో రాగిజావ పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మ

ఉగాది శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సెంట్రల్ నియోజకవర్గ ప్రజలకు రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు శోభకృత్ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ నూతన వసంతంలో ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని, అందరూ ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు.

చతుర్వేద పారాయణానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం

లబ్బీపేటలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఏప్రిల్ రెండు నుంచి నాల్గో తేదీ వరకూ జరిగే దినత్రయ సంపూర్ణ చతుర్వేద పారాయణానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణుకు ఆహ్వానం అందింది. టీటీడీ వేద పండితులు మంగిపూడి వెంకటశాస్త్రి ఘనపాఠి సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని ఎమ్మెల్యే విష్ణు కార్యాలయానికి మంగళవారం విచ్చేసి ఆయనకు ఆహ్వానాన్ని అందించారు.



ఎమ్మెల్యే మల్లాది విష్ణుకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న వెంకటశాస్త్రి

సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేయాలి

జాయింట్ కలెక్టర్ శ్రీవాస్‌నుపూర్ అజయ్

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): గ్రామ, వార్డు సచివాలయ అధికారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్‌అజయ్ కుమార్ సూచించారు. నగర పాలక సంస్థ పరిధిలోని దుర్గాపురం, రోశళ్ల పాలెం గులాబితోట వార్డు సచివాలయాలను మంగళవారం జాయింట్ కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వార్డు సచివాలయ పరిధిలో ప్రజల నుంచి అందే ఫిర్యాదులను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు.అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆవరణలో పచ్చదనాన్ని పెంచేలా మొక్కలు నాటాలన్నారు. సమస్యల పరిష్కారానికి వచ్చే ప్రజలతో సిబ్బంది స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. తనిఖీలో నార్త్ తహసీల్దార్ సీహెచ్ దుర్గాప్రసాద్ ఉన్నారు.



వార్డు సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న జాయింట్ కలెక్టర్

మొబైల్ కోర్టులో పలువురికి జరిమానా

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర వీధులలో ప్రజలకు అవాంతరం కలగించే వారికి మున్సిపల్ కోర్టు న్యాయమూర్తి రామ్మోహనరావు జరిమానా విధించారు. మంగళవారం ఆయన సర్కిల్–1 పరిధిలోని శానిటరీ ఇన్‌స్పెక్టర్ 25 మందిపై కేసులు నమోదు చేయగా వారిని విచారించారు. అందులో ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్న వారిని, పశువులను రోడ్ల పైకి వదిలే వారిని, రోడ్లపై చెత్త వేసే వారిని విచారించి వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం వారందరికీ జరిమానా విధించి హెచ్చరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి రామ్మోహన్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలను అమలు చేయాల్సిన బాధ్యత అందరిపై ఉంది, ప్లాస్టిక్ రహిత నగరంగా మార్చేందుకు శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రెటరీలు, కూడా నిత్యం ఆయా డివిజన్లలో ప్లాస్టిక్ విక్రయ షాపులను తనిఖీ చేసి విధిగా ప్లాస్టిక్ బ్యాన్ అమలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ సురేష్‌బాబు, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రెటరీలు పాల్గొన్నారు



నిబంధనలు ఉల్లంఘించిన వారిని విచారిస్తున్న జడ్జి రామ్మోహనరావు

రహదారుల పనుల పరిశీలన



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 58వ డివిజన్ నందమూరినగర్, ఉప్పలపాటి సీతారామరాజు వీధి ప్రాంతాల్లో జరుగుతున్న తారురోడ్డు నిర్మాణ పనులను డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ మంగళవారం పరిశీలించారు. వార్డ్ సచివాలయ సిబ్బందిని పిలిపించి వారికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ నగర శివారు ప్రాంతాలైన నందమూరినగర్, తోటవారివీధి, ఉప్పలపాటి సీతారామరాజువీధి వంటి అనేక ప్రాంతాల్లో నూతన రహదారుల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

జీవ ఎరువునే వినియోగించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): రసాయన ఎరువుల వినియోగం వల్ల క్యాన్సర్ వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని, కావున జీవ ఎరువు అయిన లీఫ్ కంపోస్ట్‌ను వినియోగించాలని పలువురు వక్తలు సూచించారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్ ఆర్గనైజేషన్, జువాలజీ విభాగం ఆధ్వర్యంలో లీఫ్ కంపోస్ట్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా లీఫ్ కంపోస్టు వినియోగించడంతో పక్రృతి నాశనం కాకుండా అరికట్టవచ్చన్నారు. అలాగే అనారోగ్య సమస్యలు దరిచేరవన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి లీఫ్ కంపోస్ట్ వినియోగించాల్సిన ఆవశ్యకతను, రసాయన ఎరువుల వాడకంతో కలిగే అనర్థాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఆర్గనైజేషన్ లోకల్ అడ్మిన్ లీలాకుమారి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. కళాశాల జువాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎం.విజయ్‌కుమార్ మాట్లాడుతూ కళాశాలలో లీఫ్ కంపోస్ట్ తయారీకి కావలసిన సకల సదుపాయాలు అందబాటులో ఉన్నాయన్నారు. దీని వల్ల విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన, లీఫ్ కంపోస్టు తయారీలో హ్యాండ్స్ ఆన్ ట్రెనింగ్, స్వయం ఉపాధి అనే మూడు అంశాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు.

ఉగాది ఉత్సవాలకు ఆలయాల ముస్తాబు

విజయవాడ కల్చరల్: శోభకృత్ ఉగాది వేడుకల సందర్భంగా నగరంలోని వివిధ ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పున్నమ్మతోట టీటీడీ కల్యాణమండపంలో ఉగాది ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ ప్రాంతీయ ఆలయ సమూహ ఎగ్జిగ్యూటివ్ ఇంజినీర్ పీ వెంకటయ్య మంగళవారం కల్యాణమండపంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉదయం ప్రత్యేక పూజలు, భక్తులకు తీర్థ ప్రసాదాలు, సాయంత్రం పంచాంగ శ్రవణం నిర్వహిస్తునట్లు తెలిపారు. వేడుకల వివరాలు ఉన్న పోస్టర్‌ను ఆవిష్కరించారు. కంచికామకోటి పీఠ పాలిత శ్రీ శారదా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఉదయం వేద పఠనం, వేదపండిత సత్కారం, పంచాగ శ్రవణం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మాగంటి సుబ్రహ్మణ్యం, మేనేజర్ శర్మ తెలిపారు. దుర్గాపురంలోని రామకోటి ఆలయ ప్రాంగణంలో సూర్యోపాసన, ఉగాది వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ తెలిపారు.



ఉగాది వేడుకల వివరాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వెంకటయ్య ఇతర దేవాలయ సిబ్బంది

డివిజన్‌లో జీఎం అరుణ్‌కుమార్ జైన్ సమీక్ష సమావేశం

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ డివిజన్ పనితీరుపై దక్షిణ మధ్య రైల్వే జోన్ జీఎం అరుణ్‌కుమార్‌జైన్ మంగళవారం విజయవాడ డివిజనల్ కార్యాలయంలో డీఆర్ఎం, ఏడీఆర్ఎమ్‌లు, పలు విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రాజెక్టుల గురించి డీఆర్ఎం షివేంద్రమోహన్ జీఎంకు వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2022–23లో గూడూరు–విజయవాడ సెక్షన్‌లలో 135.8 కిలోమీటర్లు విద్యుద్దీకరణతో మూడవ లైన్ నిర్మాణ పనులతో పాటు బ్రాంచ్ లైన్ డబ్లింగ్ పనులు పూర్తిచేయడంలో కృషిచేసిన విజయవాడ డివిజన్ అధికారులను జీఎం అభినందించారు. రోజువారీ వీధుల్లో ఎదురవుతున్న సమస్యలు, హెడ్‌క్వార్టర్స్ నుంచి అందించాల్సిన విషయాలపై బ్రాంచ్ అధికారులతో మాట్లాడారు. హెడ్ క్వార్టర్స్ నుంచి డివిజన్‌కు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా జీఎం హామీ ఇచ్చారు.



సమీక్షలో అరుణ్‌కుమార్ జైన్

డివిజన్ సమస్యల పరిష్కారానికి చర్యలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): డివిజన్‌లో సమస్యలను తెలుసుకుని తక్షణమే వాటి పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు స్థానిక 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణిమూర్తి పేర్కొన్నారు. మంగళవారం తిరుమలశెట్టివారివీధి, ఒగిరాలవారివీధుల్లో జరుగుతున్న పనులను ఆయన పర్యవేక్షించారు. కార్యక్రంలో వైఎస్సార్ సీపీ నాయకులు చాంద్ శర్మ, వీఎంసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



తిరుమలశెట్టివారివీధిలో పనులు పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ శర్వాణిమూర్తి

వర్షం నీటి ముంపునకు శాశ్వత పరిష్కారం

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలోని నైజాంగేట్ పరిసర ప్రాంతాలు వర్షపు నీటి ముంపునకు గురి కాకుండా చర్యలు చేపడుతున్నట్లు మాజీ మంత్రి, ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సబ్ కలెక్టర్ అదితి సింగ్‌తో కలిసి 55, 56 డివిజన్ల పరిధిలోని వించి పేట, నైజాంగేట్, కంసాలీపేట, ఆర్ఆర్ పేట ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లో నెలకున్న డ్రెయినేజీ సమస్యలకు శాశ్వత పరిష్కరాన్ని కృషి చేస్తామన్నారు. దశాబ్దాలుగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ఉన్నత స్థాయి అధికారులతో కలిసి ఈ పర్యటన చేపట్టినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ఎర్రకట్ట బ్రిడ్జిని మరో మూడు నెలల్లో ఆధునీకీకరిస్తామన్నారు. అనంతరం ఆయా ప్రాంతాల్లోని ప్రధాన డ్రెయిన్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో రైల్వే శాఖ, ఆర్అండ్‌బీ అధికారులు, నగర పాలక సంస్థ అధికారులు, 55, 56 డివిజన్ల కార్పొరేటర్లు పూర్ణచంద్రరావు, యలకల చలపతిరావు పాల్గొన్నారు.



పాత ఆర్ఆర్‌పేటలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, కలెక్టర్ ఢిల్లీ రావు, కమిషనర్, సబ్ కలెక్టర్

కమ్మని దక్షిణాది రుచుల ఫెస్టివల్

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఉగాది సంబరాల పేరుతో ఎంజీ రోడ్డులోని హోటల్ ఫార్చ్యూన్ మురళీపార్క్‌లో కమ్మని దక్షిణాది రుచుల ఫుడ్ ఫెస్టివల్ మంగళవారం ప్రారంభమైంది. హోటల్‌లోని జుడియాక్ రెస్టారెంట్‌లో ఏర్పాటు చేసిన ఫెస్టివల్‌లోని వంటకాలు నోరూరిస్తున్నాయి. ఉగాదిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ ఫెస్టివల్‌లో ఆంధ్రా రీజియన్, రాయలసీమ, కోనసీమ, తెలంగాణాలో ప్రసిద్ధి చెందిన వంటకాలను అందుబాటులో ఉంచారు. నగర వాసులు కోసం విభిన్న రుచులతో ఫెస్టివల్‌ను ఏర్పాటు చేసినట్లు హోటల్ జీఎం ఎంవీఎస్ విజయ్‌కృష్ణ తెలిపారు.



నీటి సంరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత



మధురానగర్(విజయవాడ సెంట్రల్): నీటి సంరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు మంగళవారం ప్రపంచ నీటి దినోత్సవ వేడుకల్లో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్‌లో మానవులు ఎదుర్కొనే నీటి సమస్యను ఎదుర్కొనేందుకు ఇప్పటి నుంచి తమ వంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమం కో ఆర్డినేటర్ ఎస్‌కే బీబీ కార్యక్రమం నిర్వహణ ఆవశ్యకతను వివరించారు. రసాయనశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వీ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ యూనిట్ కో–ఆర్డినేటర్లు డాక్టర్ జీ నాగార్జున, డాక్టర్ పీ రమేష్ పాల్గొన్నారు.

కృష్ణపట్నం పోర్టు పనితీరుపై పీసీసీఎం జాన్‌ప్రసాద్ సమీక్ష

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లోని అదాని కృష్ణపట్నం పోర్టు పనితీరుపై ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ (పీసీసీఎం) మేనేజర్ జాన్‌ప్రసాద్ మంగళవారం సమీక్షించారు. ముందుగా వెంకటాచలంరోడ్ జంక్షన్‌లో నూతనంగా నిర్మించిన ఎలక్ట్రానిక్ ఇన్ మోషన్ వెయిట్ బ్రిడ్జిని ఆయన ప్రారంభించారు. అనంతరం అదాని కృష్ణపట్నం పోర్టు ప్రైవేట్ సైడింగ్ లిమిటెడ్‌ని సందర్శించి సీఈఓ జీజే రావుతో సమావేశమయ్యారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో అత్యధిక స్థాయిలో బొగ్గు లోడింగ్ సాధించడంలో మేనేజ్‌మెంట్ అందించిన సహకారినిక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పరితీరుపై సమీక్షించారు. ప్రస్తుత, రానున్న ఆర్థిక సంవత్సరంలో లోడింగ్ అంచనాలు, సరుకు రవాణా అదాయ అంచనాలు, సరుకు రవాణాలో కొత్త మార్గాలు మెరుగుపర్చుకోవడానికి రైల్వేశాఖ, పోర్టు అధికారులు ఇదే పనితీరును కొనసాగించాల్సిందిగా సూచించారు. ప్రస్తుత డిమాండ్, లోడింగ్ లక్ష్యాలను చేరుకోవడానికి రైల్వేశాఖ నుంచి పూర్తి మద్దతు, సహకారం అందిస్తామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీనియర్ డీఏఎం డి.నరేంద్రవర్మ, డీసీఎం జి.సోమశేఖర్‌నాయుడు పాల్గొన్నారు.



వెంకటాచలంరోడ్ జంక్షన్‌లో ఎలక్ట్రానిక్ ఇన్ మోషన్ వెయిట్ బ్రిడ్జిని ప్రారంభించిన పీసీసీఎం జాన్‌ప్రసాద్

ఉగాది వేడుకలకు సిద్ధం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉగాది వేడుకలకు నగరంలోని దేవాలయాలు ముస్తాబయ్యాయి. ముత్యాలంపాడులోని శ్రీపార్వతీసమేత రామలింగేశ్వరస్వామి దేవాలయం, అయోధ్యనగర్‌లోని శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో బుధవారం ప్రత్యేక పూజలు ,అర్చనలు చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు.

జోరుగా విక్రయాలు

ఉగాది పచ్చడికి అవసరమైన వేపపువ్వు, మామిడికాయలు, చెరుకు విక్రయాలు మంగళవారం సాయంత్రం జోరుగా సాగాయి. వేపపువ్వు కట్ట పది నుంచి ముప్పై రూపాయల వరకు, మామిడి కాయలు సైజును బట్టి రూ10 నుంచి రూ.50 వరకు, చెరకు ముక్కలు రూ.10 నుంచి రూ.30 వరకు విక్రయించారు. ఉగాది పూజలకు అవసరమైన పండ్లు, పూలు, మామిడి ఆకులను స్థానికులు కొనుగోలు చేశారు. మధురానగర్, ముత్యాలంపాడు, అయోధ్యనగర్, రామకృష్ణాపురం, చుట్టుగుంట, మాచవరం ప్రాంతాల్లో విక్రయాలు జరిగాయి

వృక్ష సంపదను కాపాడుకోవాలి

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): వృక్ష సంపదను కాపాడుకోవాలని అటవీ శాఖ డెప్యూటీ కన్జర్వేటర్ వి.కృష్ణమూర్తి చెప్పారు. సిద్ధార్థ కళాశాల ఎకో క్లబ్, గ్రీన్ క్లబ్, కళాశాలలోని వాటర్ కన్జర్వేషన్ క్లబ్ సంయుక్తంగా ప్రపంచ అటవీ దినోత్సవాన్ని మంగళవారం కళాశాల ఆవరణలోని సెమినార్ హాల్లో నిర్వహించారు. కృష్ణమూర్తి విద్యార్థులకు అటవీ సంరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. మానవ అవసరాల కోసం వృక్ష సంపదను విచక్షణా రహితంగా తొలగించడంతో క్రమేపీ అటవీ విస్తర్ణం తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సమీపంలోని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి అటవీ సంపదపై కళాశాల యాజమాన్యం విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రిన్సిపాల్ రమేష్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ ప్రొఫెసర్ రాజేష్ సీ.జంపాల, వృక్ష శాస్త్ర విభాగాధిపతి పి.శ్రీనివాసరావు, అధ్యాపకులు డి.శ్రావణి, వి.విశాలాక్షి, నాగార్జునతో పాటుగా విద్యార్థులు పాల్గొన్నారు. కాలేజీ ఆవరణలో కళాశాల ప్రతినిధులు, అధ్యాపకులతో కలిసి కృష్ణమూర్తి మొక్కను నాటారు.

ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని, ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండ పర్యవేక్షించారు.